క్లుప్తంగా

శ్మశానవాటిక అభివృద్ధి పనుల పరిశీలన



తిమ్మరాజుపేట శ్మశానవాటికను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ అధికారులు

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట శ్మశానవాటిక అభివృద్ధి పనులను సోమవారం పంచాయతీరాజ్ ఈఈ నగేష్‌బాబు, డీఈ మునిశేఖర్‌లు పరిశీలించారు. గత కొద్ది రోజులుగా శ్మశానవాటిక అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో పనులు నాణ్యతగా జరిగేలా చూడాలని అధికారులు సూచించారు. సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పంపిణీ



కె.వెంకటాపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం అందిస్తున్న సిబ్బంది

కోటవురట్ల : కె.వెంకటాపురంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషకాహార పంపిణీ నిర్వహించారు. లబ్ధిదారులకు పాలు, గుడ్లు, చిక్కీలు అందించి పోషకాహారంపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఇంట్లో లభించే పప్పు దినుసులు, ఆకు కూరలతో పోషకాహారాన్ని తయారు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం రక్తహీనతను నిర్మూలించేందుకు పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు.

గణపర్తిలో నేడు రక్తదాన శిబిరం

మునగపాక : మండలంలోని గణపర్తిలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు జనసేన నేత కాళ్ల చంద్రమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడగలమన్న నమ్మకంతో శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 10గంటలకు జరిగే రక్తదాన శిబిరంతో పాటు విశాఖకు చెందిన మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చంద్రమోహన్ కోరారు.

కూలిన ఇంటి పోర్టికో



దిమిలిలో కూలిన ఇంటి పోర్టికో శిథిలాలను పరిశీలిస్తున్న వీఆర్వో సత్యనారాయణ

రాంబిల్లి : దిమిలిలో కూలిన ఇంటి పోర్టికో శిథిలాలను సోమవారం వీఆర్వో జి.సత్యనారాయణ పరిశీలించారు. నల్లమారి సన్యాసిరావుకు చెందిన ఈ ఇంటి పోర్టికో ఆదివారం సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తహసీల్దార్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళతానని సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ, గ్రామ వలంటీర్లు డబ్బీరు రాము, కోట భాస్కర్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శివయ్య సదస్యం

నక్కపల్లి : ప్రముఖ శివాలయం ఉపమాక శ్రీ భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వర స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సదస్యం (పండిత సభ) నేత్రపర్వంగా జరిగింది. ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చకులు కృష్ణమాచార్యులు, వెలవల పల్లి మహేష్, ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసారు. కర్ణాటకకు చెందిన వేద పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస కులకర్ణి, అమలాపురం వేదపాఠశాల స్మార్త అధ్యాపకులు అకొండి సాయిశర్మ, యలమంచలి వేదపాఠశాల విద్యార్థులు సదస్యం కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణల నడుమ జరిగిన పండిత సభ ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది. భక్తులకు పండిత బృందం ఏకకాలంలో ఆశీర్వచనం అందజేసింది. వేదపండితులను నక్కపల్లికి చెందిన శింగంశెట్టి బాపన్నశెట్టి కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.వి. రామకృష్ణ, డి.వి.ఎస్‌రావు, శింగం శెట్టి నాని, ప్రగడ వీరబాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం



నక్కపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష హాలు వద్దకు వెళ్తున్న విద్యార్థులు



నక్కపల్లి : పరీక్ష కేంద్రాలను పరిశీలించిన అధికారులు



కొరుప్రోలులో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ ప్రసాద్‌రావు, ఎంఈవో మూర్తి



పాయకరావుపేట : విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపిస్తున్న సిబ్బంది

నక్కపల్లి : మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1085 మంది రెగ్యులర్ విద్యార్థులు, 15మంది ప్రైవేటు విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. మండల కేంద్రంలో నక్కపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 214 మంది, బాలికల గురుకుల పాఠశాలలో 214 మంది గురుస్ పాఠశాలలో 205 మంది, వేంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 261 మంది, గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 206 మంది ఈ పరీక్షలకు హాజరయ్యారని ఎంఈవో డీవీడీ ప్రసాద్ తెలిపారు. రెగ్యులర్, ప్రైవేటు కలిపి 17 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్‌నకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సదుపాయాలతో పాటు, ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల ప్రాంగణంలో 144వ సెక్షన్ విధించారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ నీరజ, ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవో డీవీడీ ప్రసాద్, ఎస్‌ఐ శిరీషలు సందర్శించారు.

ఎస్.రాయవరం : మండలంలో మొదటి రోజు పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అయిదు పరీక్ష కేంద్రాల్లో 1151 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 9 మంది గైర్హాజరు అయ్యారు. కొరుప్రోలు పరీక్ష కేంద్రంలో 220 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ముగ్గురు హాజరు కాలేదు. జెడ్పీహెచ్ఎస్‌లో పూర్తి స్థాయిలో 243 మంది హాజరయ్యారు. ఎస్.రాయవరంలో 250 మందికి 248 మంది, ధర్మవరం అగ్రహారంలో 202 మందికి 200 మంది విద్యార్థులు, తిమ్మాపురం శ్రీ ఆదర్శాలో 232కి 230, ప్రయివేటు విద్యార్థులు నలుగురు పూర్తి స్థాయిలో హాజరై పరీక్షలు రాశారన్నారు. ఈ క్రమంలో పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి.పరీక్ష కేంద్రాల వద్ద మహిళా పోలీసులను అందుబాటులో ఉంచి విద్యార్థులకు అవసరమయిన సూచనలు ఇచ్చారు. ఎస్‌ఐ ప్రసాద్‌రావు అన్ని పరీక్ష కేంద్రాలను పరీక్షించి జాగ్రత్తలు తీసుకున్నారు.

కోటవురట్ల : మండలంలో 471 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానుండగా మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 386 మంది, నర్సీపట్నం మండలం వేములపూడిలో 85 మంది పరీక్షలు రాస్తున్నారు. కోటవురట్లలో జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. పాములవాక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 85 మంది విద్యార్థులు అక్కడకు దగ్గరలో ఉన్న నర్సీపట్నం మండలం వేములపూడి జెడ్పీ హైస్కూల్‌లో పరీక్షలు రాస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా ఎస్‌ఐ నారాయణరావు భద్రతా ఏర్పాట్లు చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది మందులు అందుబాటులో ఉంచారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పాయకరావుపేటలో

పాయకరావుపేట : మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో 1277 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు మండల విద్యాశాకాధికారి కె.ఎస్.గాంధీ తెలిపారు. పట్టణంలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్, చైతన్య టెక్నో, కనోస్సా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ఎస్.నర్సాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, పాల్తేరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయా పరీక్ష కేంద్రాలకు 8.30 గంటలకే విద్యార్థులు హాజరు కాగా 8.45 గంటలకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు.పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వద్ద సెల్‌ఫోన్‌లు, వాచీలు, వాటర్‌బాటిల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు లేకుండా విద్యార్థులను పరీక్ష నిర్వాహక సిబ్బంది తనిఖీలు నిర్వహించి కేంద్రాల్లోకి పంపించారు.

యలమంచిలి : యలమంచిలి పట్టణంలో నాలుగు టెన్త్ పరీక్ష కేంద్రాల్లో 822 మంది విద్యార్థులకు గాను 813 మంది తొలిరోజు పరీక్షకు హాజరవగా, 9 మంది గైర్హాజరయినట్టు ఎంఈవో బి.విశ్వనాథం తెలిపారు. పట్టణంలో ఉన్న నాలుగు పరీక్ష కేంద్రాలు కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీ పాఠశాల, శ్రీచైతన్య టెక్నో స్కూల్, తులసీనగర్‌లో ఉన్న బాలికల పాఠశాలకు ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. కేంద్రాల వద్ద పోలీసులు విద్యార్థులకు తనిఖీలు నిర్వహించి లోపలికి అనుమతించారు. కొంతమంది వికలాంగ విద్యార్థులు వారి తల్లిదండ్రుల సహాయంతో పరీక్ష కేంద్రాలకు వచ్చారు. పదో తరగతి ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు మధ్యాహ్నం 2గంటలకు యలమంచిలిలో ఏర్పాటు చేసిన 2 పరీక్ష కేంద్రాలు, కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తులసీనగర్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల కోసం కారెత్తిస్తున్న ఎండలో చెట్ల కింద వేచి ఉన్నారు.

మునగపాక : మండలంలో మునగపాక, నాగులాపల్లి, గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూళ్లతో పాటు ప్రగతి పబ్లిక్ స్కూల్‌ను పరీక్ష కేంద్రాలకు ఎంపిక చేశారు. సోమవారం జరిగిన పరీక్షకు విద్యార్థులు ఉదయం నుంచి సకాలంలో కేంద్రాలకు చేరుకున్నారు. ఉత్సాహంగా వచ్చి పరీక్షలు రాశారు. విద్యార్థులను తమ తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు బైక్‌లు, ఆటోలపైన తీసుకువచ్చారు. పోలీసు బందోబస్తు నడుమ పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా అధికారులు తగు చర్యలు తీసుకున్నారు.



కోటవురట్ల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న మహిళా పోలీసులు

ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు

రాంబిల్లి: మండలంలో నాలుగు పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో సోమవారం ప్రశాంతంగా తొలి రోజు పరీక్ష ముగిసింది. రాంబిల్లి, పంచదార్ల, దిమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు రాంబిల్లి రవీంద్ర పాఠశాల కేంద్రంలో మొత్తం 738 విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి వుండగా ఈ నాలుగు కేంద్రాల్లో ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవో ఎం. సూర్యారావు తెలిపారు.

పరీక్ష కేంద్రం సందర్శించిన డీఈవో

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం పరిధిలో నాలుగు సెంటర్లకు గానూ 873 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయాల్సి ఉండగా, 15 మంది గైర్హాజరయినట్టు సమాచారం. అచ్యుతాపురం హైస్కూల్ సెంటర్‌లో ఇద్దరు, ఏపి రెసిడెన్షియల్ స్కూల్ సెంటర్‌లో ఇద్దరు, గాయత్రీ ఇంగ్లిషు మీడియం స్కూల్ సెంటర్‌లో ఆరుగురు గైర్హాజరయ్యారు. అచ్యుతాపురం హైస్కూల్ సెంటర్‌లో పరీక్షలు జరుగుతున్న తీరుని డీఈవో లక్ష్మణమ్మ పరిశీలించారు.



రాంబిల్లి పరీక్ష కేంద్రంలో విద్యార్థుల కోలాహలం



పాయకరావుపేట : పరీక్ష కేంద్రంలో రూం నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

అర్హులందరికీ పింఛన్లు



గంగాదేవిపేటలో పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నరసింహనాయుడు

మునగపాక : ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కేపీఏ నరసింహనాయుడు కోరారు. గంగాదేవిపేటలో సోమవారం రాత్రి అర్హులైన లబ్ధిదారులకు ఆయన పింఛన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు జరుగుతున్నాయన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి రూ.3వేలు వంతున పింఛన్ అందుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా తిరిగి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు వాకపల్లి నూకాలమ్మ, గృహ సారథి టేకుపూడి సత్యనారాయణ, వలంటీర్ హరి పాల్గొన్నారు.

చినగుమ్ములూరులో జేజేఎల్ఎం పనులు



చినగుమ్ములూరులో జేజేఎల్ఎం పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కాకర దేవి

ఎస్.రాయవరం : గ్రామాల్లో సురక్షితమైన తాగునీరు అందివ్వాలనే సంకల్పంతో నియోజకవర్గానికి కోట్లాది రూపాయలు జల్‌జీవన్ మిషన్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారని జెడ్పీటీసీ కాకరదేవి అన్నారు. చినగుమ్ములూరు గ్రామంలో రూ.60 లక్షలు ఇంటింటా కుళాయి ఏర్పాటు పనులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలో చాలా గ్రామాలు సురక్షితమైన తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని జల్‌జీవన్ మిషన్‌లో ప్రతి ఇంటికి ఉచితంగా కుళాయి ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ పనులు పూర్తయితే గోదావరి జలాలు మండలానికి అలాగే నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోనికి వస్తాయన్నారు. ఇప్పటికే దాదాపు గ్రామాల్లో పైపులైను ఇంటింటా కుళాయి ఏర్పాటు పూర్తయ్యిందని, మరి కొన్ని గ్రామాల్లో పనులు పూర్తవుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాడి అప్పలనరసింహ, పంచాయతీ కార్యదర్శి కళ్యాణి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



తిమ్మరాజుపేటలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు

మునగపాక : ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కోరారు. తిమ్మరాజుపేటలో సోమవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానం కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా మేలు జరుగుతుందన్నారు. ఇటువంటి సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఎంపీటీసీ శరగడం అప్పలనరసమ్మ, వైద్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



నక్కపల్లిలో పింఛను అందిస్తున్న వలంటీరు



మామిడివాడలో పెన్షను అందిస్తున్న దృశ్యం

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో సోమవారం పింఛన్లు పంపిణీ చేసారు. బ్యాంకులు సెలవులు కారణంగా ఈ నెల ఒకటి, రెండు తేదీల్లో పింఛన్లు పంపిణీ చేయలేదు. సోమవారం గ్రామ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు లబ్ధిదారులకు పింఛన్లు అందజేసారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

నక్కపల్లి: పింఛన్ల పంపిణీ సోమవారం సాయంత్రం ప్రారంభమయింది. వరుసగా మూడురోజులు సెలవు దినాలు కావడంతో సోమవారం బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. పంచాయతీ కార్యదర్శులు ఈ పింఛను సొమ్మును బ్యాంకుల నుంచి సోమవారం మధ్యాహ్నం డ్రా చేశారు. సోమవారం నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, కోటవురట్లలో పలు బ్యాంకుల వద్ద రద్దీ ఎక్కువగా ఉంది. సాయంత్రానికి నగదు డ్రాచేసి క్లస్టర్ల వారీగా వలంటీర్లకు అందజేశారు. వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. సోమవారం ఏసమయానికైనా పింఛన్ల బట్వాడా పూర్తి చేయాలని వలంటీర్లను ఆదేశించినట్టు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు.

నేడు 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం

మునగపాక : యలమంచిలి నియోజకవర్గ పరిధిలో మంగళవారం 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం యలమంచిలి పట్టణంలో జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు యలమంచిలి గురప్ప కల్యాణమండపంలో జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే రమణమూర్తి రాజు, నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ హాజరవుతారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు ఈ సమావేశానికి హాజరుకావాలని అచ్చియ్యనాయుడు కోరారు.

ఉపాధి హామీతో అభివృద్ధికి అవకాశం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక : ఉపాధి హామీ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పేర్కొన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాడ్రాపల్లి సచివాలయం వద్ద సోమవారం ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ కార్యక్రమం నిర్వహించారు. ఏపీవో ఎరకయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూకరాజు మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. అర్హులైన కూలీలకు జాబ్ కార్డులు అందజేస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న కుమారి, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

అనకాపల్లిటౌన్: గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో మహాలక్ష్మి సమేత వైకుంఠ నారాయణ, వేంకటేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభ నిర్మాణానికి వైద్యుడు బెనర్జీ దంపతులు రూ.2 లక్షల విరాళం అందించారు.

ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న అమ్మాజీ, మహిళలు

అనకాపల్లిటౌన్: కుట్టు, ఫ్యాషన్ డిజైనింగ్‌లో 40 రోజుల ఉచిత శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ఇన్‌చార్జి అమ్మాజీ సూచించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా శ్రీసత్యసాయిబాబా మందిరం వద్ద సోమవారం శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఇటువంటి శిక్షణలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారులు శ్రీకృష్ణరాజు, అన్నం రాజశేఖర్, మహిళలు పాల్గొన్నారు.

6న సామూహిక హారతి కార్యక్రమం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

మునగపాక : ఈ నెల 6న దేవాలయాల్లో సామూహిక హారతి కార్యక్రమాలు నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బీవీ రమణ కోరారు. సోమవారం మునగపాక సంతబయిల రామాలయంలో ఇందుకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. మండల కన్వీనర్ ఆడారి లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామాల్లోని ధార్మిక కమిటీలు బలపడాలన్నారు. ప్రతి నెల పౌర్ణమికి సామూహిక హారతి కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. అనకాపల్లిలో ఈ నెల 9న జరగనున్న హనుమాన్ శోభాయాత్రకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, భాస్కరరావు, ఆడారి గోపి, పెంటకోట శివగణేష్, ఆడారి సూర్యచంద్ర, సూరిశెట్టి అప్పారావు, బొడ్డేడ మహాలక్ష్మి, దాడి కాంతమ్మ, పరదేశమ్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన పోషణ పక్వాడా కార్యక్రమం



అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన వంటకాలు పరిశీలిస్తున్న దృశ్యం

మునగపాక : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోషణ పక్వాడా కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా సెక్టర్‌ల పరిధిలో కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. అరబుపాలెం పాలకేంద్రం ఆవరణలో నిర్వహించిన పోషణ పక్వాడా కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పలు రకాల పండి వంటలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంబంధిత వంటకాలను ప్రదర్శనగా ఉంచారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అరబుపాలెం, ఒంపోలు సర్పంచ్‌లు బొడ్డేడ శ్రీనివాసరావు, సూర్యనారాయణ, ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొద్దపు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా చోడమాంబిక వారి సారె ఊరేగింపు

- నేడు అమ్మవారి జాతర



చోడమాంబిక అమ్మవారి సారె ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చోడమాంబిక అమ్మవారి సారె ఊరేగింపు కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ నెల 4న అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సారె ఊరేగింపులో సర్పంచ్ గండిబోయిన వెంకట్ భాను, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ వడిశెల శ్రీనివారావు, కాకి నూకరాజు, కాకి శంకర్‌రావు, పితాని చిరంజీవి, కాకి సోమునాయుడు, కాకి అవతారం, కాకి అప్పలరాజు, వడిశెల సన్యాసినాయుడు, గంజి వెంకట సత్యనారాయణ, కాకి రమణ, నీలం రమణ తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలపై దృష్టి సారించాలి

మునగపాక : జగనన్న స్వచ్ఛ సంకల్పం శతశాతం అమలు జరిగేలా చూడాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కార్యదర్శులు సంపద తయారీ కేంద్రాలపై దృష్టి సారించాలన్నారు. అలాగే పారిశుద్ధ్యం,తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. అలాగే జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. ఈవోఆర్డీ ఈశ్వరరావు,పలువురు పంచాయతీ కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు.